సీతారాం ఏచూరికి ఘన నివాళి

ప్రజాశక్తి -దుంబ్రిగుడ:మండలంలోని సాగర పంచాయితీ అడపవలసలో ఆదివారం జరిగిన సీపీఎం శాఖ మహాసభలో సీతారాం ఏచూరికి ఘనంగా నివాళులర్పించారు. మండల సభ్యుడు తమర్ల. సూర్యనారాయణ అధ్యక్షణ జరిగిన ఈ సమావేశంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటాన్ని పూల మాలతో నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు.వి ఉమామహేశ్వరావు మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే ఏచూరి ఉద్యమాల్లో పాల్గొని పార్టీలో ఉన్నత స్థాయికి చేరుకున్నారన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించారని కొనియాడారు. పలు భాషల్లో ప్రావీణ్యం ఉందన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్‌బి పోతూరాజు, పి సత్యనారాయణ, నూకరాజు, చెడ్డ మంజుల, తమార్ల పూర్ణిమ, పాపారావు, నూకరాజు, రామూర్తి, రాజేష్, సురేష్ కుమార్, రఘనాథ్, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా.. నిర్మాణానికి నోచని రహదారి

-ఇబ్బందులు పడుతున్న గిరిజనులు-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి దుంబ్రిగుడ:- "దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వలేదు 'అన్న చందంగా సొవ్వా పంచాయితీ కమలబంద, సాగిరివలస రోడ్డు పరిస్థితి ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ రోడ్డు నిర్మించడంలో అధికారుల నిర్లక్ష్యంతో ఏళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణ పనులు జరగలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యం ఆ గ్రామస్తులకు శాపంగా మారింది.

మండలంలోని సొవ్వా పంచాయితీ కమలబంధ, సాగిరివలసకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం కోసం రూ 49లక్షల నిధులు మంజూరవ్వగా సంబంధిత కాంట్రాక్టర్ పనులు ప్రారంభించినట్లు చూపించడానికి మధ్య మధ్యలో పనులు చేస్తున్నట్లు చూపించి మధ్యలో పనులు నిలిపి వేస్తున్నారని ఆ గ్రామాల గిరిజనులు అంటున్నారు. దీంతో వర్షాలు కురిసినప్పుడు మళ్లీ రోడ్డుపైనున్న మట్టి కొట్టుకుపోవడంతో రోడ్డు అధ్వానంగా మారుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రోడ్డుకు మోక్షం కలగడం లేదని, రోడ్డు మార్గం సరిగా లేకపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు ఆ గ్రామాల గిరిజనులు ఎవరికైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే అంబులెన్స్ వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో సకాలంలో వ్యాధిగ్రస్తులను హాస్పటల్‌కు తరలించలేక పోతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు పండించే అటవి ఉత్పత్తులు వారపుసంతలో తరలించలన్నా, మండల కేంద్రమైన డుంబ్రిగుడ, అరకులోయకు అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాలన్నా కాలినడకే ఆ గ్రామస్తులకు శరణ్యమవుతుంది. తక్షణమే అధికారులు, ప్రభుత్వం స్పందించి మంజూరైన రోడ్డును నిర్మించి, డ్రైనేజీ సమస్యలు తీర్చాలని కమలబంధ, సాగిరివలస గ్రామస్తులు, పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

రవాణాకు ఇబ్బందులు పడుతున్నాం

రోడ్డు నిర్మాణానికి రోడ్డు నిర్మాణానికి సుమారు మూడేళ్ల క్రితం నిధులు మంజూరు అయ్యాయి. అధికారులు, కాంట్రాక్టర్ పనులు పనులు ప్రారంభించినట్లు చూపించి నిలిపేశారు. దీంతో రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పలుమార్లు ప్రజాప్రతినిధులకు సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. తక్షణమే రోడ్డు నిర్మించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

వంతల గురు నాయుడు,కమలబంధ గ్రామస్తుడు

రాళ్లు తేలి ఉన్న కమలబంద, సాగిరివలస రోడ్డు

వర్షాలు, వాగుల ప్రవాహం తగ్గే వరకు
టూరిస్టు ప్రదేశాలకు అనుమతి లేదు

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలో భారీ వర్షాల కారణంగా టూరిజం ప్రాంతాలకు ఎట్టి పరిస్థితుల్లో పర్యటకులను అనుమతించడం జరగదని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పేర్కొన్నారు. ఆదివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏజెన్సీలోని ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు పడుతున్నాయని, వర్షాలు తగ్గి, వాగుల ప్రవాహం తగ్గే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ మైదాన ప్రాంతం నుండి వచ్చే పర్యటకులను టూరిస్టు ప్రాంతాలకు అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. టూరిస్టు ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు తిరిగి వెళ్లే వరకు చాలా జాగ్రత్తగా ఉండాలని, కాలువలు దాటేటప్పుడు, కాలువలో దిగేటప్పుడు జాగ్రత్తలు వహించాలని సూచించారు. భారీ వర్షాలకు కాలువలు పొంగుతున్న సందర్భంగా కాలువలపై నడిచి వచ్చే ప్రజలు ఎట్టి పరిస్థితులను కాలువలు దాటవద్దని కోరారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

75 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-సీలేరు

ఇండియన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో జీకే వీధి మండలం సీలేరు సిఐటియు కార్యాలయంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కంటికి సంబంధించిన దగ్గర చూపు, దూరపు చూపు తగ్గడం, తలనొప్పి, కంటి నుండి నీరు కారుట, శుక్లాలు, కళ్ళు మంట, మెడ నరాల నొప్పి, కంటిలో దురద తదితర సమస్యలు ఉన్న 75 మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఐ క్యాంపులో రోగులకి సరసమైన ధరలకు కళ్లద్దాలు వెంటనే అందజేశారు. చిన్నపిల్లలో దృష్టి లోపం ఉన్న వారికి ప్రత్యేక కంటి పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో ఏపీ జెన్కో ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాలో 52,420 హెక్టార్లలో వరి సాగు

- లక్ష్యం మేరకు 92 శాతం పూర్తి -ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయాధికారి నందు

ప్రజాశక్తి -పాడేరు: అల్లూరి జిల్లాలో ఈ ఏడాది 52,420 హెక్టార్లలో ఖరీఫ్ వరి సాగు చేపట్టినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నందు వెల్లడించారు. జిల్లాలో సాధారణ వరి విస్తీర్ణం 56,792 హెక్టార్లు లక్ష్యం కాగా 92శాతం వరి సాగు పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో చేపట్టిన వివిధ వ్యవసాయ పంటల సాగు వివరాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన సమాచారం ఆయన మాటల్లోనే..

-జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం ఎంత?

జిల్లాలో చేపట్టే వివిధ ఖరీఫ్ వ్యవసాయ పంటల్లో ముఖ్యంగా వరి, రాగి, జొన్న, సామ, కొర్ర, వేరుశనగ, చిక్కుళ్ళు, మొక్కజొన్న తదితర పప్పు ధాన్యాలు పంటలకు సంబంధించి సాధారణ లక్ష్యం 87,871 హెక్టార్లు కాగా ఈ ఏడాది 73,138 హెక్టార్లలో వివిధ పంటల సాగు జరిగింది. ఖరీఫ్ పంటల లక్ష్యం 83 శాతం పూర్తయింది.

పంటల సాగు విస్తీర్ణ వివరాలు?

మొక్కజొన్న 3917 సాధారణ విస్తీర్ణం కాగా 1433 హెక్టార్లలోను, చోళ్ళు (రాగి) సాధారణ విస్తీర్ణం 16,376 హెక్టార్లకుగాను 13896 హెక్టార్లలోను, కొర్రలు సాధారణ విస్తీర్ణం 129 హెక్టార్ల గాను 38 హెక్టార్లలోను, సామలు సాధారణ విస్తీర్ణం 3019 హెక్టార్లకు గాను 1,848 హెక్టార్లలోను గంట్లు సాధారణ విస్తీర్ణం 76కాగా 42 హెక్టార్లు, జొన్నలు 121 సాధారణ విస్తీర్ణానికి గాను 51 హెక్టార్లలోను వేరుశెనగ సాధారణ విస్తీర్ణం 1,696 హెక్టార్లకు గాను 1,424 హెక్టార్లలోను సాగు జరిగింది.

సబ్సిడీపై విత్తనాలు పంపిణీ

జిల్లాలోని అర్హులైన ఖరీఫ్ రైతులకు 90 శాతం సబ్సిడీపై వివిధ రకాల విత్తనాలు సరఫరా చేసాం. 1,093 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు 91 లక్షల సబ్సిడీతో సుమారు 6,000 రైతులకు అందించాం. 20,564 క్వింటాళ్ల వరి విత్తనాలు 8.66 కోట్లు సబ్సిడీతో 38 వేల మంది రైతులకు సరఫరా చేసాం. 653 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు 51 లక్షల సబ్సిడీతో 2500 మంది రైతులకు సరఫరా చేసాం.4,500 క్వింటాళ్ల రాజ్మా విత్తనాలు ఆరు కోట్ల సబ్సిడీతో రైతులకు పంపిణీ చేపట్టాం. సుమారు 60 లక్షల సబ్సిడీతో 960 క్వింటాళ్ల మినుముల విత్తనాలు పంపిణీ చేశాం.

వర్షాలకు పంటల నష్టం వివరాలు

జిల్లా వ్యాప్తంగా గత ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు 2525.68 హెక్టార్లలో ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలోని 16 మండలాల్లో పంటల నష్టంపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. వివిధ పంటలకు సంబంధించి 2650 మంది రైతులకు పంట నష్టం వాటిల్లింది...

రైతులకు విత్తనాలు అందిస్తున్న సాపిడ్ డైరెక్టర్ మీరా ఖాదర్

600 మంది రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు

జులై నెలలో వచ్చిన వరదలకు నష్టపోయిన 20 గ్రామాలకు చెందిన 600 మంది రైతులకు సాపిడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా జొన్నలు, పెసలు, మినుములు తదితర విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సాపిడ్ సంస్థ డైరెక్టర్ మీరా ఖాదర్ కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఎస్‌కే అహ్మద్ అలీ, ఉర్మిదాస్, నాగరాజు, లక్ష్మి, జానకి, మేరీ, లక్ష్మి పాల్గొన్నారు.

దెబ్బతిన్న గృహాలకు రూ.10వేలు
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఇటీవల జిల్లాలో సంభవించిన వరదలు, వర్షాలకు దెబ్బతిన్న గృహాలకు పది వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందజేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నష్టపరిహారం వివరాలు, మూడు ఐటీడీఏల పరిధిలో అన్ని సచివాలయాలలో ఆదివారం ప్రకటించడం జరిగిందని లబ్ధిదారులు గమనించి వాటిపై అభ్యంతరాలను, క్లైములను ఆయా మండల తహసిల్దార్ లేదా ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. నీట మునిగిన గ్రామాల ప్రజలకు జీవనభీతి, అదేవిధంగా చింతూరు ఐటీడీఏ పరిధిలో ముంపు మండలాలలో ఇటీవల సంభవించిన వరదలు, వర్షాలకు నీట మునిగిన గ్రామాల ప్రజలు జీవనోపాధి కోల్పోయినందున ఆయా కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవన భృతి చెల్లించడానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. ఈ ముంపు గ్రామాలు చింతూరు ఐటీడీఏ పరిధిలో మాత్రమే ఉన్నందున ఆయా ముంపు గ్రామాలకు మాత్రమే వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జీవనోపాధి కోల్పోయినందున జీవన భృతికి సంబంధించిన వివరాలు చింతూరు ఐటీడీఏ పరిధిలోగల అన్ని సచివాలయాలలో ఆదివారం ప్రకటించడం జరిగిందని లబ్ధిదారులు గమనించి వాటిపై అభ్యంతరాలను, క్లెయిములను ఆయా మండల తహసిల్దార్ లేదా ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు.

దట్టంగా కురుస్తున్న మంచు

మన్యంలో దట్టంగా మంచు

ప్రజాశక్తి పాడేరు:అల్లూరి జిల్లా పాడేరు మన్యానికి మంచు కాలం ముందే వచ్చేసింది. ఆదివారం ఉదయం దట్టంగా మంచు కురిసింది. శీతాకాలం సమీపిస్తున్న తరుణంలో పొగ మంచు ముందే మన్యం వాసులను పలకరించింది. ఉదయాన్నే మార్నింగ్ వాక్ కి వెళ్లేవారు, తమ తమ విధులకు హాజరయ్యేవారు పొగ మంచును పలకరిస్తూ శీతాకాలం వచ్చేసిందని మంచి ముసుగులో సాగిపోయారు.. మన్యంలో శీతాకాలం ఆరంభం నుంచి అక్టోబర్ మొదలుకొని జనవరి వరకు నాలుగు నెలల పాటు దట్టంగా కురిసే పొగ మంచు ముసుగు వేయడం పాడేరు ఏజెన్సీకి ప్రత్యేకం! మన్యంలో గిరిజనుల ఆవాసాలు, అందమైన కాఫీ వనాలు, కొండ కోనలు, ప్రకృతి ఎంత పరవశిస్తూ మంచు ముసుగులో ఒదిగిపోతుంది. దట్టంగా కురిసే మంచు ముసుగు వల్ల రహదారులపై వెళ్లే వాహనదారులకు కనుచూపు మేరలో రోడ్డుపై కంటికి ఏమి గోచరించదు. దీంతో పగటి పూట కూడా 9 గంటల సమయం వరకు లైట్లు వేసుకుని నెమ్మదిగా రహదారులపై వాహనాలు సాగిపోయాయి.

కొత్తకోటలో వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామం లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది.. కొత్తకోట న్యూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కేదారి శెట్టి రమేష్ ఇంటి ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 104 మంది కంటి వైద్య పరీక్షలు చేయగా అందులో సుమారు 58 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ శంకర్ పౌండషన్ కంటి వైద్య శాల కు తరలించారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్
- ఏపీ గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -కూనవరం

రాష్ట్రంలోని గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, మండల కార్యదర్శి కొమరం పెంటయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కోతులగుట్ట గ్రామంలో గ్రామ వార్డు వాలంటీర్ల సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వెంకట్, పెంటయ్య మాట్లాడుతూ వాలంటీర్లకు బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే వేతనాలు చెల్లించాలని కోరారు. ఎన్నికల సమయంలో వాలంటీర్ల చేత బలవంతంగా రాజీనామా చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జాబ్ చార్ట్ ప్రకటించాలని, గౌరవ వేతనం రూ.10 వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. అనంతరం ఏపీ గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్ మండల కార్యవర్గం ఎన్నిక జరిగింది. యూనియన్ అధ్యక్షులుగా సొందే పద్మావతి, కార్యదర్శిగా చిచ్చడి మహేష్, కార్యదర్శివర్గంగా ఏడుగురు, కమిటీ సభ్యులుగా 21 మంది ఎన్నికయ్యారు.

ఎన్నికైన కార్యవర్గంతో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్, మండల కార్యదర్శి కొమరం పెంటయ్య

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-చింతూరు

దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని చింతూరు ఏఎస్పీ పంకజ్ కుమార్ మీనా పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దీపావళి సందర్భంగా జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకొని ఈ సంవత్సరం బాణసంచా తయారుచేయు /విక్రయించే దుకాణాల విషయంలో దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. చింతూరు పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అనుమతి లేకుండా బాణసంచా/ టపాసులను ఇళ్లు, షాపులు, జన సముదాయాల మధ్య గోడౌన్లలో నిల్వ చేసినా, లైసెన్సు లేకుండా అనధికార విక్రయాలు జరిపినా, పోలీసులు సూచించిన నియమ నిబంధనలను పాటించకపోయినా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాటించాల్సిన నిబంధనలు...

- బాణసంచా నిల్వచేసే కేంద్రాల నిర్వాహకులు, తయారీ చేసేవారు, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలి.
- బాణసంచా సామాగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు ప్రజల నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి.
- ఫైర్ సేఫ్టీ ముందుజాగ్రత్త చర్యలు తప్పనిసరిగా పాటించాలి.
- పై వాటిలో విధులు నిర్వహించే వారికి అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవలసిన చర్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి.
- బాణసంచా విక్రయ దుకాణాలను జనావాసాలకు, విద్యాసంస్థలకు, ఆసుపత్రులకు దూరంగా అధికారులు సూచించిన ప్రదేశంలోనే ఏర్పాటు చేయాలి.
- బాణసంచా విక్రయ దుకాణాల మధ్య కనీస నిర్దిష్ట దూరం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలెండర్లు, తగినంత పొడి ఇసుక, కావాల్సిన నీరు అందుబాటులో ఉంచుకోవాలి.
- మైనర్లను బాణసంచా నిల్వచేసే కేంద్రాలు, తయారీ, విక్రయ పనుల్లో వినియోగించరాదు.
- లైసెన్స్ కలిగి ఉన్న విక్రయిదారులు లైసెన్స్ లేని వారికి విక్రయించి, తద్వారా ఏదైనా ప్రమాదం సంభవించినా, దానికి లైసెన్స్ దారులే పూర్తి బాధ్యత వహించాలి.

మాట్లాడుతున్న ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా

- లైసెన్స్ కలిగిన విక్రయాదారులు తమ లైసెన్స్‌ను దుకాణం వద్ద తప్పనిసరిగా అందరికీ కనిపించే విధంగా ఉంచాలి.
- అనుమతి పొందిన దుకాణదారులు అధికారులు సూచించిన సమయాల్లో మాత్రమే విక్రయాలు జరపాలి. దీపావళి రోజున సాయంత్రం 5 గంటల తరువాత ఎటువంటి అమ్మకాలను జరపరాదు.

సచివాలయ ఉద్యోగులకు
ఇతర పనులు అప్పగించడం సరికాదు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఇతర పనులు అప్పగించడం సరికాదని గ్రామ సచివాలయ ఉద్యోగుల యూనియన్ సభ్యులు బి.శ్రీనివాస్ దొర అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 20 నుంచి 25 వరకు ఆరు రోజుల పాటు 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గోడ పత్రాలు, కరపత్రాలు పంచే కార్యక్రమం గ్రామ సచివాలయ ఉద్యోగులకు అప్పగించడం సరికాదని పేర్కొన్నారు. తమ డిపార్ట్మెంట్స్ పనులు మాత్రమే తమకు అప్పగించాలని, గ్రామస్థాయిలో ఇతర పనులకు వాలంటీర్లను విధులులోకి తీసుకుని వారికి అప్పగించాలని కోరారు. ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థులచే
వాటర్ ట్యాంక్, వాష్ ట్యాప్‌లు ఏర్పాటు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలలో వాటర్ ట్యాంకు, వాష్ ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు భోజనం అనంతరం కంచాలు శుభ్రపర్చుకోవడానికి, చేతులు కడుక్కోవడానికి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఈ పాఠశాల 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు యుద్ధ ప్రాతిపదికన రూ.50 వేలుతో నీళ్ల ట్యాంకు, కుళాయిలు ఏర్పాటు చేసి వాటిని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ ఎం శ్రీను, కమిటీ సభ్యులు అనురాధ, కుమారి, పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో 2004-05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్ వాష్ ట్యాప్‌లను ప్రారంభిస్తున్న పూర్వ విద్యార్థులు

రోడ్డు సౌకర్యం కల్పించాలని పివిటిజి గిరిజనుల నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని ఎంకె.పట్నం పంచాయతీ శివారు కొరుప్రోలు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని పివిటిజి కొందు ఆదివాసీ గిరిజనులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, గ్రామంలో 10 పది కుటుంబాలు 50 మంది జనాభా ఉన్నారన్నారు. కొండ పక్కనే జీవిస్తూ ఉన్నారని, వీరితో పాటు కోతులుపాలెం గ్రామం ఎస్టి కొండదొరకు చెందిన 30 కుటుంబాలు. ఎంకె.పట్నం 40 కుటుంబాల దళితులు కొరుప్రోలు గ్రామం వెనుక వీరు భూములు ఉన్నాయన్నారు. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో గెడ్డలు దాటుకుంటూ ప్రయాణం చేస్తున్నారని చెప్పారు. కొరుప్రోలు గ్రామం నుండి ఎంకే.పట్నం గ్రామానికి వెళ్లాలంటే మూడు కిలోమీటర్లు గెడ్డలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తుందన్నారు. ఊరు చుట్టూ గెడ్డలు ప్రవహిస్తుండటంతో నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రోడ్డు సౌకర్యాలు లేక పోవడంతో పలు పత్రికల్లో కథనాలు రావడంతో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు రోడ్డు ఏర్పాటు కోసం సర్వే చేశారని, రోడ్డు క్లియరెన్స్ కోసం, జంగిల్ క్లియరెన్స్ చేయడం జరిగిందన్నారు. రోడ్డు నిర్మాణం చేయడం కోసం కోటి 50లక్షలు ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపినేట్ నిధుల నుండి ఎస్టిమేషన్ వేసి పంపించడం జరిగిందన్నారు. పంచాయతీరాజ్ (ప్రాజెక్ట్స్) డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్ మరొకసారి ఎస్టిమేషన్‌కి వచ్చారన్నారు. ఇప్పటికే మొదట ఎటిమేషన్ వేసి నెల 20 రోజులు గడుస్తుందన్నారు. 2018 నుండి ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేట్లు వేస్తున్నారు తప్ప రోడ్లకి నిధులు మంజూరు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ గారు జోక్యం చేసుకొని ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంప్లిమెంట్ నిధుల నుండి ఎస్టిమేషన్ పంపించిన వాటికి రోడ్లు నిధులు మంజూరు చేసి గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. లేకుంటే ఈ నెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి డోలి యాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిటిజి సంఘం నాయకులు సుబ్బారావు, కొర్ర ఆనంద్, మండల కార్యదర్శి జీ.వాసు తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా బిఎన్ రోడ్డు

-కూరుకుపోతున్న వాహనాలు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట బిఎన్ రోడ్డు లో ఇటీవల కురిసిన వర్షాలకు పలు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ బిఎన్ రోడ్డు గత కొంత కాలంగా గోతులుగా మారింది. ఈ నేపథ్యంలో చిన్నపాటి వర్షాలకు గోతులలో మురుగు నీరు చేరి వాహనాలు కూరుకు పోతున్నాయి. ఆదివారం కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వడ్డాది నుంచి నర్సీపట్నం వెళ్తున్న లారీ లోడ్‌తో దిగబడింది. ఈ లారీ ని బయటకు తీసేందుకు లారీ డ్రైవర్ నానా అవస్థలు పడ్డారు. ఈ రోడ్డుకు గత కొంత కాలంగా కనీస మరమ్మత్తులు చేపట్టక పోవడం తో వాహనాలు మట్టిలో కూరుకుపోతున్నాయి. సంబందించిన అధికారులు పట్టించు కోక పోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయం లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చేసుకుం టున్నాయి. తారు రోడ్డు కాస్త మట్టి రోడ్డుగా మారడం తో వర్షం పడినప్పుడల్లా బురదగా మారి వాహనదా రులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం మండలం గబ్బాడ హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న పెట్ల చంద్రమౌళి రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల అనకాపల్లిలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలలో ప్రథమ స్థానం సాదించి రాష్ట్ర పోటీలకు అర్హత సాధించాడు. తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో చంద్రమౌళి పాల్గొంటాడని పీడీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యానారాయణ (కిట్టు మాస్టర్), ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

డస్ట్ బిన్‌ల పంపిణీ

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని పెదతీనార్ల గ్రామంలో ఆదివారం సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు చేతుల మీదగా గ్రామ ప్రజలకు డస్ట్ బిన్ లు పంపిణీ చేసారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా డస్ట్ బిన్ లలో వెయ్యాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులతో ప్రతి ఇంటి వద్ద చెత్తను సేకరించడం జరుగుతుందన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వెయ్యరాదని, అందరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో వైద్య సిబ్బందిని నియమించాలి

జెడ్‌పిటిసి గంగరాజు

వంటలను పరిశీలిస్తున్న గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి:ప్రభుత్వ ఆశ్రమోన్నత పాఠశాల లకు హెల్త్ సిబ్బందిని నియమించి విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విద్యార్థులు మృత్యువాతకు గురవుతున్నారని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు తెలిపారు. ఆదివారం టోకురు బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సందర్శించారు. విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని, ప్రస్తుతం విద్యార్థినిల ఆరోగ్యం పై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపరాణి, డిప్యూటీ మెట్రిన్ లను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినిలతో సమావేశం ఏర్పాటు చేసి మనోధైర్యాన్ని కల్పించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్, సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే నేరుగా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ప్రతి పాఠశాలలో వైద్య సిబ్బందిని నియమించాలని స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, రాష్ట్ర విద్యాశాఖ మంత్రిని కలిసి లిఖిత పూర్వకంగా విన్నవిస్తామన్నారు. పాఠశాలలో వంట షెడ్డు ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఐటిడిఎ పిఒ దృష్టికి తీసుకెళ్తానన్నారు. సర్పంచ్ కిల్లో మొస్య మాట్లాడుతూ, పాఠశాలలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

వంద రోజుల పాలనంతా వైఫల్యమే

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి- అరకు లోయ:కూటమి ప్రభుత్వం ఈ 100 రోజుల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మోసం చేయడం చంద్రబాబు నైజమని అందుకే ఎన్నికల్లో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారన్నారు. ఈ వంద రోజుల్లో ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల్లో కూటమి నేతలు ఇచ్చినవి అన్నీ తప్పుడు హామీలేనని ఈ వంద రోజులు పాలనలో తేలిపోయిందన్నారు. సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించి రెడ్ బుక్ పాలనను తెరమీదకు తెచ్చారని మత్స్య లింగం ఆరోపించారు.తల్లికి వందనం,ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం చేస్తామని చెప్పిన నేతలు నేటికీ దాని గురించి అసలు ఎందుకు నోరెత్తలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏ తప్పు చేసినా ప్రశ్నిస్తానని ప్రజల పక్షాన నిలుస్తానని చెప్పిన పవన్ కళ్యాణ్ చంద్రబాబును పొగడడం తప్ప వైఫల్యాలు గురించి మాట్లాడటం లేదని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లో 87 శాతం హామీలు నెరవేర్చిందని గుర్తు చేశారు. జీవో 3ను పునరుద్ధరిస్తామని అరకులో చంద్రబాబు చెప్పారని, ఇప్పటివరకు దాని గురించి కనీసం స్పందించడం లేదన్నారు. అసలు పునరుద్ధరిస్తారా? లేదా? అని ఆయన ప్రశ్నించారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్ కొవ్వూరు - గోదావరి - రాజమండ్రి - కడియం సెక్షన్ల మధ్య ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ సిస్టం ప్రారంభించడానికి ఇంటర్ లాకింగ్ పనులు కారణంగా పలు రైళ్లను రద్దుచేశారు. ఈ నెల 29న 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 17239 గుంటూరు- విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లను, 30వ తేదీన 22707 విశాఖపట్నం-తిరుపతి డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 12718 విజయవాడ-విశాఖపట్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 12717 విశాఖపట్నం-విజయవాడ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్, 22701 విశాఖపట్నం - గుంటూరు ఉదయ్ ఎక్స్‌ప్రెస్, 22702 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ ఎక్స్ ప్రెస్, 17239 గుంటూరు- విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 17240 విశాఖపట్నం- గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, 07466 రాజమండ్రి-విశాఖపట్నం మెము ప్యాసింజర్, 07467 విశాఖపట్నం- రాజమండ్రి మెము ప్యాసింజర్, అక్టోబర్ 1వ తేదీన 17240 విశాఖపట్నం- గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ లను రద్దు చేశారు. ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే - వాల్తేరు డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

బీచ్‌లో పరిశుభ్రత

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ కోస్ట్ గార్డ్, బయోప్లాస్టిక్స్ తయారీ సంస్థ ఎకోలాస్టిక్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యాన బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్‌ను చేపట్టాయి. వైజాగ్, కాకినాడలో శుభ్రపరిచే పనిని పూర్తి చేసాయని ఎకోలాస్టిక్ ప్రతినిధి చెప్పారు. ఈ క్లీనింగ్ కార్యక్రమంలో మొత్తం 6,800 మంది పాల్గొన్నారని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, సముద్ర కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాల గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో శుభ్రత కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. విశాఖ ఆర్‌కె.బీచ్ పరిశుభ్రతలో కోస్ట్ గార్డ్ డిప్యూటీ కమాండెంట్ రాజేష్ మిట్టల్ పాల్గొన్నారు.

కొత్తకోటలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామం లో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది.. కొత్తకోట న్యూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కేదారి శెట్టి రమేష్ ఇంటి ఆవరణలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 104 మంది కంటి వైద్య పరీక్షలు చేయగా అందులో సుమారు 58 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండషన్ కంటి వైద్య శాల కు తరలించారు. రోగులకు వాసవి క్లబ్ సభ్యులు ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ జాన్, క్యాంపు మేనేజరు అరుణ్ కుమార్,వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ కె.రమేష్, సెక్రటరీ కె.నరేంద్ర, ట్రెజరీ పి.అశోక్, వైస్ ప్రెసిడెంట్ కె.రామారావు పాల్గొన్నారు.

పరిహారానికి ఎదురుచూపు

- వేట నిషేధకాలంలో మత్స్యకారుల అప్పులు
- తీర్చలేక పెరుగుతున్న వడ్డీ భారం

పూడిమడక తీరంలో వలలు తయారుచేస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సముద్రంలో చేపల వేట నిషేధ కాలానికి మత్స్యకారులకు చెల్లించాల్సిన పరిహారం ప్రభుత్వం ఇవ్వలేదు. గత ప్రభుత్వం అర్హత కల్గిన మత్స్యకారులకు బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు చొప్పున మే రెండోవారంలో జమచేసింది. వేట నిషేధ కాలంలో చెల్లించే పరిహారం రూ.20వేలకు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మత్స్యకారులు ఆశ పడ్డారు. రూ.20వేల పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికీ పరిహారం మత్స్యకారుల ఖాతాలో జమచేయకపోవడంతో వేట నిషేధ కాలంలో కుటుంబ అవసరాలకు చేసిన అప్పులు తీర్చలేక వడ్డీలు పెరుగుతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు.

అనకాపల్లి జిల్లాలో 73 కిలోమీటర్ల పొడవున సముద్ర తీరంలో 32 గ్రామాలున్నాయి. 86,497 మంది మత్స్యకార జనాభాలో 2,238 బోట్లలో 12,996 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నారు. వీరిలో 10,750 మందిని పరిహారానికి అర్హులుగా మత్స్యశాఖ గుర్తించింది. ప్రతియేటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో చేపల వేట ప్రభుత్వం నిషేధిస్తోంది. నిషేధ కాలంలో మత్స్యకారుల జీవన భృతి కోసం పరిహారం చెల్లిస్తోంది. ఈ ఏడాది ఇవ్వాల్సిన పరిహారం డబ్బులు మత్స్యకారులకు చెల్లించకపోవడంతో వేట నిషేధ కాలంలో కుటుంబ అవసరాలకు రెండు రూపాయల వడ్డీకి తెచ్చిన అప్పు తీర్చుకోలేకపోతున్నామని, తనఖా పెట్టిన బంగారం, వలలు తెచ్చుకోలేకపోతున్నామని పూడిమడక మత్స్యకారులు ప్రజాశక్తి వద్ద వాపోయారు. నిషేధపు రోజుల్లో ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోతే, మరో జీవనాధారంలేని మత్స్యకారులు అత్యధికమంది కుటుంబ అవసరాలకు అప్పులు చేస్తారు. నిషేధ అనంతరం వేటకు వెళ్లి అప్పులు తీర్చుతుంటారు. ఈ ఏడాది వేట సరిగాలేకపోవడం, పరిహారం సొమ్ము ప్రభుత్వం ఇవ్వకపోవడంతో అప్పు తీర్చలేక వడ్డీ భారం పెరుగుతోందని మత్స్యకారులు తెలిపారు.

పరిహారం రాక అప్పు తీర్చలేకపోయాను

పరిహారం రూ.20వేలు ఇస్తామని ప్రభుత్వమివ్వలేదు. గతంలో మే నెలలో డబ్బులు పడేవి. చేపలవేట లేనికాలంలో రెండు రూపాయల వడ్డీకి రూ.20వేలు అప్పుజేశాను. వేట సరిగాలేక, ప్రభుత్వం డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పు తీర్చలేదు. వడ్డీ పెరుగుతుంది.

గంగల సత్తిబాబు, మత్స్యకారుడు పూడిమడక

ప్రభుత్వ సాయం లేదు

బతికే ఆధారంలేనప్పుడు పరిహారం డబ్బులు ఇవ్వకపోతే ఏమి తిని బతుకుతాం. రెక్కలపై బతకడమే గానీ ప్రభుత్వం సాయంలేదు. తెప్పలకు రెండు నెలలవుతున్నా డబ్బులు పడలేదు.

చోడిపల్లి ఎర్రయ్య, పూడిమడక

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

సిమెంట్ రేకులు, ఇనుము పైపులు అందిస్తున్న జమాల్‌ఖాన్

ప్రజాశక్తి- చింతూరు :భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాటాకు ఇల్లు పూర్తిగా నేలమట్టం కావడంతో బాధిత కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గృహ నిర్మాణ సామగ్రి ఆదివారం అందజేశారు. బీసీ కాలనీకి చెందిన డ్రైవర్ గుడ్ల కనకారెడ్డి తాటాకు ఇల్లు వర్షాలకు కూలిపోయింది. దీంతో కనకారెడ్డి కుటుంబానికి నీడలేకపోవడంతో ఈ విషయాన్ని స్థానికులు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన జమాల్ ఖాన్ ఇంటి నిర్మాణానికి 10 సిమెంట్ రేకులు, పది ఇనుప పైపులను జెకెసి ట్రస్ట్ ద్వారా తన సొంత వాహనంలో తరలించి అందజేశారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల కారణంగా సామాన్యుల నివాసాలను కోల్పోయి నిస్సహాయులుగా మారుతున్నారని, తను చేసిన ఈ చిన్న సహాయం వారి నష్టాన్ని పూరించలేదని, ఇతరులు కూడా ఎంతోకొంత సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జెకెసి ట్రస్ట్ కార్యదర్శి ఇమ్రాన్ ఖాన్, సభ్యులు అబ్రార్ ఖాన్, షేక్ రియాజ్, స్థానిక నాయకులు ముత్యాల శ్రీరామ్, పసుపులేటి సాల్మన్ రాజు, పొదిలి రామారావు పాల్గొన్నారు.

సహకార సొసైటీలపై సర్కారు శీతకన్ను

భెల్ త్రిఫ్ట్ సొసైటీ మహాజన సభలో జిటివి ప్రకాష్

ప్రజాశక్తి -గాజువాక : సహకార సంఘాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు శీతకన్ను చూపిస్తున్నాయని భెల్ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ జిటిపి ప్రకాష్ ధ్వజమెత్తారు. ఆదివారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన భెల్, హెచ్‌పివివి ఎంప్లాయిస్ కోఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ 55వ మహాజనసభలో మాట్లాడుతూ, వంద రోజుల పాలనలో సహకార సంఘాలకు సాయంపై రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ప్రకటన చేయలేదన్నారు. కంపెనీలో సభ్యులు తగ్గిపోతే సొసైటీ వ్యాపారం తగ్గుతుందని, సభ్యులను పెంచాలన్నారు. సొసైటీలో రాజకీయ జోక్యం తగదన్నారు. అందరు డైరెక్టర్లతో కలిసి ఐక్యమత్యంతో ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. సంఘ కార్యదర్శి మండ వెంకటరాజు మాట్లాడుతూ, సభ్యుల రుణపరిమితిని రూ.రెండు లక్షల నుంచి రూ.ఆరు లక్షలకు పెంచడంతోపాటు వడ్డీని 13శాతం నుంచి 12శాతానికి తగ్గిస్తూ మహాజనసభలో తీర్మానించినట్లు వెల్లడించారు. రూ.5.48 కోట్ల టర్నోవర్ కలిగిన సంఘంలో 386 మంది సభ్యులుండగా, ఈ ఏడాది వార్షిక ఆదాయము రూ.2,19,550 వచ్చినట్లు కార్యదర్శి నివేదికలో వెల్లడించారు. సంఘం బైలా నెంబర్ 4,18, 19, 41(ఏ)లను సవరణ చేస్తున్నట్లుగా తెలిపారు.

సంఘ అధ్యక్షులు కె.రామునాయుడు అధ్యక్షత వహించిన సభలో ఉపాధ్యక్షులు కె. ధర్మారావు 2024 -25 సంవత్సర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టగా సభ్యులు ఆమోదించారు. కార్యక్రమంలో సంఘ డైరెక్టర్లు జి.ప్రసాద్, ఎన్‌బి. ప్రశాంత్‌కుమార్, సంఘ మేనేజర్ జివి రమణారావు, సంఘ సభ్యులు, హెచ్‌పివిపి యూనిట్‌లోని వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు..

ప్రభుత్వ నిర్ణయంపై గీత కార్మికుల హర్షం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మద్యం పాలసీపై కూటమి ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాల్లో భాగంగా 10శాతం వైన్ షాప్‌లను గీతకర్మికులకు కేటాయించడంపై గీత కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం మూడో వార్డు నేరెళ్ళ వలస కాలనీ సామాజిక భవనంలో కల్లు గీత సహకార సంఘాల అధ్యక్షుల సమావేశంలో యా త సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగటి రాము మాట్లాడుతూ, గీత కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 10 శాతం మద్యం దుకాణాలు కేటాయించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు చిట్టిబోయిన రాము, రీసు రమణ, గండిబోయిన రమణ, కాకర ఎల్లారావు పాల్గొన్నారు

కళాశాల భవన నిర్మాణం పూర్తి చేయరూ..?

అసంపూర్తిగా నిర్మాణం నిలిచిపోయిన జూనియర్ కళాశాల భవనం

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలోని అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని తక్షణమే పూర్తి చేయాలని ఆ కళాశాల విద్యార్థులు కోరుతున్నారు. వైసిపి ప్రభుత్వం జూనియర్ కళాశాల తరగతుల గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులను అదే పార్టీకి చెందిన అసామీకి అప్పగించింది. అయితే భవన నిర్మాణాలు చేసి ప్లాస్టింగ్ జరగిన తరువాత పనులు నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. తరగతి గదుల నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి తరగతి గదుల నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

నూతన ఇసుక విధానంతో ఇబ్బందులు



మాట్లాడుతున్న లారీ ఓనర్స్‌అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణ

ప్రజాశక్తి -ఆనందపురం: కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన ఉచిత ఇసుక విధానంతో లారీ ఓనర్స్, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మద్దెల వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గంభీరం హైస్కూల్ సమీపంలో నిర్వహించిన అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతూ, ఆన్‌లైన్ ఇసుక విధానంతో ఇప్పటివరకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడం, శ్రీకాకుళంరీచ్‌లో బ్లాక్‌మార్కెట్‌లో అధిక ధరకు ఇసుక అమ్మకాలు, ఓవర్‌లోడ్ పేరుతో పోలీసుల కేసులతో లారీ ఓనర్స్ మనుగడ కష్టమౌతోందన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సురేష్, జాయింట్ సెక్రెటరీలు శ్రీనివాసరావు భాస్కరరావు, ట్రెజరర్ నమ్మి అప్పల మాధవరావు, పాల్గొన్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : అంబేద్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును సస్పెండ్ చేయాలని, రంగరాయ మెడికల్ కాలేజీలో వివాదాన్ని సృష్టించి, దళిత డాక్టర్ ఉమామహేశ్వరరావు పై దాడి చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని తక్షణమే అరెస్టు చేయాలని విదసం ఐక్య వేదిక ఏపి స్టేట్ కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు.

ఆదివారం గాజువాకలోని ప్రయివేటు హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం దళితులపై దాడులు, దౌర్జన్యాలకు ప్రతీకారంగానే రాష్ట్రంలోని దళితులందరూ ఏకమై జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించారని, ఇపుడు కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నేతలు అదే సంస్కృతిని కొనసాగించడం దుర్మార్గమన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని, తక్షణం పదవుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బల్ల కుమార్, గుడివాడ ప్రసాద్, గుడాల ఈశ్వరరావు, యుఎస్ రాజు, మండే సత్యనారాయణ, గోసంగి తిరుపతిరావు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో కేన్సర్ నిర్ధారణ వైద్యశిబిరం

ప్రజాశక్తి- గాజువాక : స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్, (సిఐటియు), స్టీల్‌త్రిఫ్టు సొసైటీ, ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం పెదగంట్యాడ నడుపూరు కళాభవన్‌లో ఆదివారం కేన్సర్ నిర్ధారణకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో డాక్టర్ సునందా. డాక్టర్ సుకన్య మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వారం, నోటి కేన్సర్ కేసులు ఇటీవల పెరుగుతున్నాయని,ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహనకు ఆది, సోమవారాల్లో ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో త్రిఫ్టు సొసైటీ చైర్మన్ పి నారాయణరావు. డైరెక్టర్లు . శశిభూషణ్, ఎస్.నాగకృష్ణ, కె సత్యవతి, స్టీల్‌కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు నాయకులు నమ్మి రమణ, జి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి సత్యవతి, కేన్సర్ ఆసుపత్రి పిఆర్‌ఒ పిఎం నాయుడు. సిఐటియు సీనియర్ నాయకుడు డి వెంకటరావు పాల్గొన్నారు.

ఆదివాసీ నిరుద్యోగులంతా 23న ఐటిడిఎకు తరలిరావాలి

ప్రజాశక్తి- దేవీపట్నం: ఆదివాసీ నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 23న రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారికి వినతి పత్రం ఇవ్వటానికి నిరుద్యోగులంతా ఐటిడిఎకు తరలిరావాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ ట్రైనింగ్ పొందిన ఆదివాసీ నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్‌సి ప్రకటించాలని, వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్‌టి బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, ఆశ్రమ పాఠశాలలో ఏఎన్‌ఎంలను నియమించాలని, షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియమకాల చట్టం చేయాలని తదితర సమస్యలపై 23న ఉదయం 10 గంటలకు ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్లు అందజేత

ప్రజాశక్తి- చింతూరు : మండల కేంద్రంలోని గొల్ల బజారు, వాడబజారు, ఎస్టీ కాలనీ చెందిన యువ క్రీడాకారులకు జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వాలీబాల్ కిట్లును ఆదివారం అందజేశారు. క్రీడాకారులు తమకు వాలీబాల్ కిట్లు ఇవ్వాలని ఇటీవల జమాల్‌ఖాన్‌ను కోరగా, జెకెసి ట్రస్ట్ సెక్రటరీ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఎస్కే రియాజ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి-అడ్డతీగల: కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా అడ్డతీగల మండలం ధాన్యంపాలెం, తుంగమడుగులు, పంచాయతీల్లో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఇంటి ఇంటికి తిరిగి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తి చేసుకొని ఇప్పటి వరకు చేసిన మంచి పనులు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు చెల్లిబోయిన శ్రీనివాస్, జత వెంకటరమణ, ఇ.స్వప్న కుమారి, అక్కపల్లి పండు, మాజీ ఎంపీపీ అన్నం సత్తిబాబు, మాజీ ఎంపిటిసి పుడిగి ఆదిలక్ష్మి, ఎడ్ల శ్రీనివాస్, కుప్పాల జయరా, తాటికొండ రాజేంద్ర, సాయి, ఎంపీడీవో విజయ రంగారావు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జిప్సా నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఇండస్ట్రియల్ ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ (జిప్సా) నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గిరీష్ విద్యానికేతన్‌కరస్పాండెంట్ బి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ ఎస్ షణ్ముఖరావు, కోశాధికారిగా బాలవికాస్ స్కూల్ ఎం.బాబూరావు ఎన్నికయ్యారు. సంబంధిత నియామక పత్రాలను పి ప్రభాకర్, డి రాఘవరాజు, ఎం.జగ్గారావు అందజేశారు.. అలాగే గౌరవాధ్యక్షులు గా పాలవలస భాస్కరరావు, ఆర్ శోభన్‌బాబు, సలహాదారులుగా పి మురళీసుందర్, ఎం.జగ్గారావు, బి శ్రీధర్, జి జగన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎ.రాము, జి కుమార్, పలువురు ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్సులు, సహాయ కోశాధికారులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పి వాసుదేవరావు, బ్యూలా గిరి, సత్యన్నారాయణ, రమేష్ నాయుడు, రవికుమార్, కృష్ణంనాయుడు, మౌళి, నాయుడు, శ్రీనివాస్, లక్ష్మణరావు, వివిధ పాఠశాలల నుంచి 100మంది కరెస్పాండంట్స్ పాల్గొన్నారు..